

సమాజంలో మార్పు కోసం, ప్రజల శ్రేయస్సు కోసం అహరహం శ్రమించడమే శ్రేష్ఠమైన ధర్మం.'

# Dr.PRK పవర్

పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప



రామకృష్ణ హాస్పిటల్స్

పక్షవాతం, డిస్క్ సమస్యలు,
నడుమునొప్పి
మెడ నొప్పులకు
పూర్తి చికిత్స కలదు.
నిరుపేదలకు ఉచిత వైద్యం



రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్

విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ
సెల్: 9849485100



సంపుటి : 01 సంచిక : 335 | ఆదివారం 6 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


# ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా?

## ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు... వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు

### సీట్లు పెరిగితే 117 గెలుస్తాం
### ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం
### కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?
### నకిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
### వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం

**హైదరాబాద్, పవర్ న్యూస్**

ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్ధిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్ధిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు



ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డ కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

# డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

**(హనుమకొండ - పవర్)**




హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు, కుడా మాజీ ఛైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఛైర్మన్ రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ , 'పవర్' దినపత్రిక డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ గారు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఆత్మకూరు గ్రామానికి చెందిన ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా క్రియాశీలక సేవలు అందిస్తూ, ప్రజల ఆదరాభిమానాలను పొందారని పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గ ఇన్ఛార్జ్‌గా, కుడా ఛైర్మన్‌గా ప్రజలకు, పార్టీకి విశేష సేవలు అందించిన ఆయన, ప్రస్తుతం హన్మకొండ డీసీసీ అధ్యక్షుడిగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు.రాజకీయ రంగంలోనే కాకుండా క్రీడారంగంలో ఐపీఎల్ జట్టు డెక్కన్ ఛార్జర్స్ సీఈఓగా, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించి తనదైన ముద్ర వేశారని తెలిపారు. అలాగే ఎనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వరంగల్, పరకాల పరిసర ప్రాంతాల్లో యువతకు క్రీడా ప్రోత్సాహకాలను అందిస్తూ, అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.సమర్థవంతమైన నాయకత్వంతో ముందంజలో ఉండే శ్రీ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి గారు పరిపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నూరేళ్లు వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ గారు హృదయపూర్వకంగా ఆకాంక్షించారు.



# తెలంగాణ గవర్నర్‌ను కలిసిన ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డి. రాజి రెడ్డి

**హైదరాబాద్, పవర్ న్యూస్**

శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ డి. రాజి రెడ్డి తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ను గవర్నర్ భవన్ లో కలిశారు. ఈ సందర్భంగా అక్టోబర్ లో నిర్వహించనున్న విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి సంబంధించిన అంశాలపై విన్నవించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఉద్యాన రంగం తీరు తెన్నులపై గవర్నర్ కు వివరించారు . ఉద్యాన రంగంలో ఆధునిక టెక్నాలజీ వినియోగం, నూతన అంశాల పరిశోధన, విద్యా విధానాలను వైస్ ఛాన్సలర్ గవర్నర్ కు తెలిపారు. వర్సిటీ ప్రచారాలను గవర్నర్ కు వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. భగవాన్ ఉన్నారు.

# కొండా సురేఖ చేరికపై బీజేపీ నేత మురళీధర్ రావు కీలక వ్యాఖ్యలు

### ఎవరు పడితే వాళ్లను పార్టీలోకి చేర్చుకోబోమని స్పష్టీకరణ
### కాంగ్రెస్ సంక్షోభాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి కథనాలని ఆరోపణ

**హైదరాబాద్, పవర్ న్యూస్**



మాజీ మంత్రి కొండా సురేఖ బీజేపీలో చేరనున్నారంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. ఈ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చుతూ, పార్టీలో చేరికలపై తమకంటూ ఒక స్పష్టమైన విధానం ఉందని తెలిపారు. "ఎవరిని పడితే వారిని పార్టీలో చేర్చుకోబోం" అని ఆయన శనివారం స్పష్టం చేశారు.కొండా సురేఖ చేరిక ప్రచారం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని మురళీధర్‌రావు ఆరోపించారు. "ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొంది. ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కథనాలను ప్రచారంలోకి తెస్తున్నారు" అని ఆయన విమర్శించారు.




# కేబినెట్ మార్పు చేర్పులకు కసరత్తు!?

### అసెంబ్లీ సమావేశాలు ముగియగానే కార్యాచరణ
### ప్రస్తుతం కేబినెట్‌లో మూడు ఖాళీలు
### నామినేటెడ్ పదవులు కూడా ఒకే సారి భర్తీ
### సరిగ్గా పని చేయని వారికి తప్పని ఉద్వాసన

**హైదరాబాద్, సెప్టెంబర్ 5**

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో అత్యంత కీలకమైన రాజకీయ ఘట్టానికి తెరలేపుతోంది. మంత్రివర్గంలో మార్పుచేర్పులు ,ఖాళీల భర్తీ ప్రక్రియను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి తుది అనుమతి లభించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగియగానే ఈ విస్తరణ ప్రక్రియను పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ పరిణామం కేవలం పదవుల పెంపకానికే పరిమితం కాకుండా, పార్టీపై , పాలనపై సీఎం తన పట్టును మరింత బిగించే ప్రక్రియగా కనిపిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ కేబినెట్‌లో సాంకేతికంగా ఖాళీలు ఏర్పడగా, కొండా సురేఖ బర్తరఫ్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రాతినిధ్యంతో పాటు బీసీ మహిళా స్థానం ఖాళీ అయింది. అంటే ప్రస్తుతం మూడు ఖాళీలు ఉన్నాయి. దీంతో పాటు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రాతినిధ్యాన్ని కల్పించడం సీఎం రేవంత్ ముందున్న ప్రధాన లక్ష్యం. మూడేసి ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, పనితీరు సరిగ్గా లేని కొంతమంది మంత్రుల శాఖలను మార్చడం లేదా వారి స్థానంలో నూతన ముఖాలకు అవకాశం కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రణాళిక సిద్ధమైంది. కొండా సురేఖను తప్పించిన వెంటనే, నష్ట నివారణ చర్యల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ముగ్గురు కీలక బీసీ మహిళా నేతలకు ఉన్నతమైన నామినేటెడ్ ..మిగతా 2లో

# కొండా సురేఖ స్థానంలో ఎవరు?..

### - కేబినెట్ విస్తరణపై మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
### - ఢిల్లీ పర్యటనలో విస్తరణపై చర్చ జరగలేదన్న పీసీసీ చీఫ్

**హైదరాబాద్, పవర్ న్యూస్**

కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు.ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు.కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా.. ఏఐసీసీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు.

### ఇప్పట్లో విస్తరణ లేనట్లే!

ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు.తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై తనకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.



# ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుంది





### చౌల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**(ఆత్మకూరు -- పవర్):**

ఆత్మకూరు మండలం చౌల్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను, మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మన పిల్లలే రాబోయే దేశ భవిష్యత్తు అని, వారి విద్యా వికాసాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రత్యేకంగా అల్పాహార పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలు నేడు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలల తరహాలో మౌలిక వసతులు కల్పిస్తూ, విద్యార్థులకు రుచికరమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం మరియు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

---

# పదేళ్లలో జరగని ఎన్నో పనులకు ప్రజా ప్రభుత్వంలో శ్రీకారం

### ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే నాయిని




**(హనుమకొండ -- పవర్):**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు. గతంలో సంవత్సరాల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపుతూ, నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 52వ డివిజన్‌లో పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వెనుక ప్రాంతంలో మరియు 6వ డివిజన్‌లోని పద్మశాలీవాడలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.90 లక్షల వ్యయంతో, 52వ డివిజన్‌లో రూ.60 లక్షలు, 6వ డివిజన్‌లో రూ.30 లక్షలతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని గారు స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, డివిజన్ నాయకులు, కాలనీ వాసులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల పరిస్థితి, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అంతర్గత రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్న కాలనీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.గత పదేళ్లలో అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటి ప్రాంతాలను గుర్తించి ఒక్కొక్క సమస్యకు పరిష్కారం చూపుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.నియోజకవర్గంలోని ప్రతి కాలనీకి మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. అభివృద్ధి అనేది ప్రధాన రహదారులు, కూడళ్లకే పరిమితం కాకుండా ప్రతి కాలనీకి, ప్రతి వీధికి చేరాలని తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొనే సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే తమ ప్రాధాన్యత అని చెప్పారు. అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు కూడా తగ్గుతాయని తెలిపారు. చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనులు ప్రారంభించిన తర్వాత నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు వేగం పెరిగిందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడంతో పాటు కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు.ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నామని, ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో మంజూరు చేయిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని మరిన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, అధికారులు, కార్యకర్తలు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

---



## ఆత్మకూరు నూతన సీఐని సన్మానించిన తెలంగాణ ఉద్యమకారులు

**(ఆత్మకూరు -- పవర్):**

ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. బాబులాల్‌ను శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆత్మకూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. 2001 నుండి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న నాయకులు, వివిధ గ్రామాల ఉద్యమకారులు మండల కేంద్రంలో సమావేశమై నూతన సీఐకి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ఎల్లప్పుడూ అండదండలుగా నిలవాలని ఈ సందర్భంగా సీఐని కోరారు.అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. బాబులాల్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలకు కట్టుబడి ఉండాలని, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఏవైనా చట్టవ్యతిరేక లేదా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ఉద్యమకారులను కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం, ఆత్మకూరు మండల అధ్యక్షుడు ఎండి. బాబుమియా, చిరు మండల ప్రధాన కార్యదర్శి దొంక దువ్వ రాజన్న, ఆత్మకూరు అధ్యక్షుడు భాషబోయిన సాగర్, నీరుకుల అధ్యక్షుడు పసుల లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచులు అక్కల కుమారస్వామి, చిట్టే రవి, మాజీ మార్కెట్ డైరెక్టర్ కాకాని శ్రీధర్, ప్రతాప్ రెడ్డి, మంద రవి, నత్తి దేవేందర్, నాగేల్లి స్వామి, హుస్సేన్, బలభద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**(ఆత్మకూరు -- పవర్):**

ఆత్మకూరు మండలం అక్కంపేట, చౌల్లపల్లి గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు శనివారం పరామర్శించారు.ఆయా గ్రామాల్లోని మృతుల నివాసాలకు వెళ్లిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు, మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధైర్యపడవద్దని, బాధితులకు అన్ని విధాలా అండగా ఉండి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కుడా ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణికి శుభాకాంక్షలు తెలిపిన కడియం శ్రీహరి

(హనుమకొండ -- పవర్):

హనుమకొండలోని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో శనివారం కుడా ఛైర్మన్‌గా గుండు సుధారాణి ప్రమాణ స్వీకారం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గుండు సుధారాణికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.?ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ... కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ మరింత ప్రగతిపథంలో పయనించే విధంగా, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన మరియు పట్టణాభివృద్ధి పనులు వేగవంతం చేసే దిశగా కృషి చేయాలని కుడా ఛైర్మన్ గుండు సుధారాణికి సూచించారు.?ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్



జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆయుబ్ అలీ, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకట్, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

(వరంగల్ -- పవర్):

గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ డివిజన్ ఆరేపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని వర్ధన్నపేట శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఘనంగా ఏర్పాటు చేసిన సేవా సమితి కమిటీ సభ్యులను, ఉత్సవ కమిటీ నిర్వాహకులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక



ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మదర్ తెరిసా సేవలు చిరస్మరణీయం

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

(హనుమకొండ -- పవర్):

మదర్ తెరిసా వర్ధంతి సందర్భంగా ఫాతిమా నగర్‌లోని మదర్ తెరిసా విగ్రహం వద్ద శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని మదర్ తెరిసా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... సమాజంలోని పేదలు, నిరుపేదలు, అనాథలు, నిరాశ్రయులు, అభాగ్యుల కోసం మదర్ తెరిసా చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఎలాంటి స్వార్థం లేకుండా మానవ సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ఆమె సేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మదర్ తెరిసా చూపిన మానవతా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, సమాజంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలను మరింత



విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు అకాడమీ ఛైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొని మదర్ తెరిసా సేవలను స్మరించుకున్నారు.

## కుడా ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణికి శుభాకాంక్షలు తెలిపిన చిలువేరు శ్రీనివాస్

వరంగల్, సెప్టెంబర్ 05(పవర్ న్యూస్ ):

హనుమకొండలోని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో శనివారం కుడా ఛైర్మన్‌గా గుండు సుధారాణి ప్రమాణ స్వీకారం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ వరంగల్ జిల్లా చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ గుండు సుధారాణికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

?ఈ సందర్భంగా చిలువేరు శ్రీనివాస్ మాట్లాడుతూ... కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ మరింత ప్రగతిపథంలో పయనించే విధంగా, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన



మరియు పట్టణాభివృద్ధి పనులు వేగవంతం చేసే దిశగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయూబ్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న,నరేంద్రకుమార్, నల్లగొండ రమేష్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన ఒయాసిస్ ఛైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి

(ఆత్మకూరు -- పవర్):

ఆత్మకూర్ మండల కేంద్రానికి చెందిన బీజేపీ కార్యకర్త కొమ్ము మయాకర్ తండ్రి కొమ్ము చిన్ని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఒయాసిస్ ఛైర్మన్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్లి, కొమ్ము చిన్ని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ... కొమ్ము చిన్ని మృతి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఆత్మకూర్ మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ళ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు సదానందం, మాజీ జెడ్పీటీసీ టీంగిలికారి సత్యనారాయణ, ముల్క ప్రసాద్, వంగాల బుచ్చిరెడ్డి, వాడి రాజు, వాడికారి రమేష్, భయ్యా మాలగం, వరికెల రామకృష్ణతో పాటు కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం : నాయిని నీలిమ రెడ్డి



(హనుమకొండ -- పవర్):

ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి సతీమణి శ్రీమతి నాయిని నీలిమ రెడ్డి గారు శనివారం 51వ డివిజన్ పరిధిలోని 'స్పందన' మానసిక దివ్యాంగులు, బధిరుల కేంద్రంలో స్థానిక చిన్నారులతో కలిసి ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్రంలోని అధ్యాపకులను ప్రత్యేకంగా సన్మానించి, ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొని వారితో ఆప్యాయంగా ముచ్చటించారు.ఈ సందర్భంగా నాయిని నీలిమ రెడ్డి గారు మాట్లాడుతూ... ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని అన్నారు. విద్యతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, స్వావలంబన పెంపొందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఈసీ మెంబర్ శ్రీమతి అనితా రెడ్డి, 51వ డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ కరీం, నాయకులు లక్ష్మారెడ్డి, రవీందర్ రెడ్డి, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.



## కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణిని సన్మానించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

(వరంగల్ -- పవర్):

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి గుండు సుధారాణి గారిని వర్ధన్నపేట శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి గారికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వరంగల్ నగరం మరియు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై వారు చర్చించారు. కుడా ఛైర్‌పర్సన్‌గా ఆమె నేతృత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధితో పాటు వర్ధన్నపేట నియోజకవర్గం మరింత ప్రగతి సాధిస్తుందని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ మాజీ కార్పొరేటర్ జన్ను అనిల్ కుమార్, షిబిరాణీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి సమాజాన్ని నిలబెట్టే బాధ్యత

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

(హనుమకొండ -- పవర్):




విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది వేసే ప్రతి ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు ఉత్తములేనని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాన్నే కాకుండా సమాజాన్ని, భవిష్యత్ తరాన్ని ఉత్తమ మార్గం వైపు నడిపిస్తారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, సమాజాన్ని నిలబెట్టే బాధ్యత కలిగి ఉంటుందని పేర్కొన్నారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాలే కాకుండా మానవత్వపు విలువలను నేర్పిస్తూ, నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుండటంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 841 పాఠశాలల్లో 1,56,995 మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. ఎస్ఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయుల కృషితో జిల్లాను మరింత మెరుగైన స్థానంలో నిలిపినట్లు కొనియాడారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ విద్యాశాఖ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు.

విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు నెహ్రూ నాయక్, మనోజ్ కుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఏఎంఓ డాక్టర్ మన్మోహన్, సునీత, సుమా, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి: పొన్నం ప్రభాకర్ డిమాండ్

### వెయ్యి రోజులుగా సభకు రాకుండా జీతం తీసుకుంటున్నారని ఆరోపణ

### కేసీఆర్ వైఖరికి నిరసనగా 6న ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నా

హైదరాబాద్, పవర్ న్యూస్



ధర్నాలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను వివరిస్తామన్న మంత్రులు సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# హైదరాబాద్ జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణ..

### కర్రలతో దాడులు
### రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం దాడులు
### తీజ్ వేడుకల్లో మొదలైన వివాదం అర్ధరాత్రి కొట్లాటకు దారి
### 19 మందిపై కేసులు నమోదు, 8 మంది విద్యార్థుల అరెస్ట్
### పాత కక్షలతో పాటు యువతి వ్యవహారంపైనా పోలీసుల విచారణ




హైదరాబాద్, పవర్ న్యూస్

హైదరాబాద్‌లోని జేఎన్టీయూ క్యాంపస్ విద్యార్థుల ఘర్షణతో రణరంగంగా మారింది. గురువారం అర్ధరాత్రి రెండు వర్గాలకు చెందిన విద్యార్థులు కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడగా, వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు 19 మంది విద్యార్థులపై కేసులు నమోదు చేసి, 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం క్యాంపస్‌లో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన చిన్న వాగ్వివాదానికి పాత కక్షలు కూడా తోడవడంతో తీవ్ర ఘర్షణకు దారితీసింది. రాత్రి సుమారు 2:30 గంటల సమయంలో మంజీరా హాస్టల్‌కు చెందిన కొందరు విద్యార్థులు, గౌతమి హాస్టల్‌పై దాడి చేశారు. అక్కడి విద్యార్థులను గదుల్లోంచి బయటకు పిలిచి కర్రలతో దాడికి పాల్పడ్డారు.

సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నా ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై రెండు వర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు మూడు వేర్వేరు కేసులు నమోదు చేశారు. పాత గొడవల నేపథ్యంలోనే ఈ ఘర్షణ జరిగిందని, ఓ యువతికి సంబంధించిన కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ రీతిరాజ్ తెలిపారు. ఘర్షణ సమయంలో ఓ విద్యార్థి మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించామని, దీనిపైనా విచారణ జరుపుతున్నామన్నారు. మరోవైపు, ఈ ఘటనపై విచారణ కమిటీని ఏర్పాటు చేశామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జేఎన్టీయూ ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి. నరసింహారెడ్డి స్పష్టం చేశారు. పరారీలో ఉన్న మిగతా విద్యార్థుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.



# ఫరియా గ్లామర్ ట్రీట్..

'చిట్టి' కొత్త ఫొటోషూట్‌తో సెగలు!

అందం, అభినయంతో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఫరియా అబ్దుల్లా. 'జాతిరత్నాలు'లో 'చిట్టి' పాత్రతో ప్రేక్షకులకు దగ్గరైన ఆమె.. నటనతో పాటు డ్యాన్స్, గానం, గీత రచనలోనూ ప్రతిభ చాటుకున్నారు. ప్రస్తుతం వరుస అవకాశాలతో బిజీగా ఉన్న ఫరియాకు సోషల్ మీడియాలోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. తాజాగా స్టైలిష్ వైట్ అవుట్‌ఫిట్‌లో ఫొటోషూట్ చేసిన ఫరియా.. విభిన్న భంగిమల్లో పోజులిస్తూ ఆకట్టుకున్నారు. ఆమె కొత్త ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారగా.. అందం, స్టైల్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.





# ఎవర్‌గ్రీన్ ఎలిగెన్స్..

ప్రియమణి స్పెషల్

సినీ నటి ప్రియమణి తాజా ట్రెడిషనల్ ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. బనారస్ చీర, తలలో మల్లెపూలు, సంప్రదాయ ఆభరణాలతో హుందాగా మెరిశారు. సింపుల్ మేకప్‌తో ఇచ్చిన స్టైలిష్ పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారతీయ సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ లుక్‌కు సోషల్ మీడియాలో విశేష స్పందన లభిస్తోంది. "సాంప్రదాయంలోనే అసలైన అందం", "బనారస్ చీరలో రాజసంగా ఉన్నారు" అంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తుండగా, ఈ ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.



# ఫ్యాషన్ ఫైర్‌గా నోరా ఫతేహి

డ్యాన్సింగ్ డాల్ గ్లామర్ షో

బాలీవుడ్ నటి నోరా ఫతేహి తాజాగా జరిగిన 'జీక్యూ బెస్ట్ డ్రెస్డ్ నైట్' ఈవెంట్‌లో స్టన్నింగ్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. 90ల క్లాసిక్ ఫ్యాషన్‌కు ఆధునిక టచ్ జోడిస్తూ వైట్ షర్ట్, థైహై స్లిట్‌తో కూడిన హైవేస్ట్ డెనిమ్ మ్యాక్సీ స్కర్ట్‌లో స్టైలిష్‌గా మెరిశారు. లేయర్డ్ గోల్డ్ చోకర్స్, స్టేట్‌మెంట్ ఇయర్‌రింగ్స్, మెస్సీ అప్‌డో హెయిర్‌స్టైల్ ఆమె లుక్‌కు మరింత గ్లామర్‌ను జోడించాయి. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, నెటిజన్లు నోరా ఫ్యాషన్ సెన్స్ అందాన్ని ప్రశంసిస్తున్నారు.

# హాఫ్ శారీలో హీట్ పెంచిన రష్మీ

ఆరెంజ్ లుక్‌లో అభిమానులను ఫిదా చేసిన యాంకర్
కుందనపు బొమ్మలా ఉందంటూ కామెంట్స్

బుల్లితెర ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అవసరం లేని పేరు రష్మీ గౌతమ్. తన చలాకీ యాంకరింగ్‌తో పాటు గ్లామరస్ లుక్స్‌తో సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ అందాల యాంకర్, తాజాగా షేర్ చేసిన ఫొటోలతో మరోసారి నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది.ఈసారి సంప్రదాయ హాఫ్ శారీలో మెరిసిపోయిన రష్మీ, తన లేటెస్ట్ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంది. ఆరెంజ్ రంగు హాఫ్ శారీలో ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ట్రెడిషనల్ టచ్‌కు మోడ్రన్ స్టైల్‌ను జోడించిన ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది.అందమైన ఆభరణాలు, ఆకర్షణీయమైన హెయిర్‌స్టైల్‌తో రష్మీ మరింత హుందాగా కనిపించింది. భంగిమల్లో కెమెరాకు పోజులిస్తూ తనదైన స్టైల్‌తో ఆకట్టుకుంది.ఈ ఫొటోలను చూసిన అభిమానులు "ట్రెడిషనల్ లుక్‌లో చాలా అందంగా ఉన్నారు", "హాఫ్ శారీలో కుందనపు బొమ్మలా మెరిసిపోతున్నారు" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.





# చీరలో చెలరేగిన బేబి బ్యూటీ

'ఎపిక్' ఈవెంట్‌లో ట్రెడిషనల్ లుక్‌తో ఆకట్టుకున్న హీరోయిన్

'బేబి' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న నటి వైష్ణవి చైతన్య తాజా గా జరిగిన 'ఎపిక్' సినిమా ఈవెంట్‌లో ట్రెడిషనల్ లుక్‌తో ఆకట్టుకున్నారు. అందమైన చీరలో హుందాగా మెరిసిన ఆమె, చీరకు తగ్గ ఆభరణాలు, ఆకర్షణీయమైన హెయిర్‌స్టైల్‌తో ప్రత్యే కంగా కనిపించారు. చిరునవ్వులతో కెమెరాల కు ఇచ్చిన పోజులు అభిమానులను ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడి యాలో వైరల్‌గా మారగా, "చీరలో మరింత అందంగా ఉంది", "ట్రెడిషనల్ లుక్‌లో అదరగొట్టింది" అంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# బ్లాక్ బ్యూటీగా మెరిసిన అమృత

'టార్టాయిస్' ఈవెంట్‌లో ఎలిగెంట్ లుక్‌తో ఆకట్టుకున్న నటి

తెలుగు నటి అమృత చౌదరి తాజాగా జరిగిన 'టార్టాయిస్' సినిమా ఈవెంట్‌లో బ్లాక్ చీరలో ఎలిగెంట్ లుక్‌తో ఆకట్టుకున్నారు. సంప్రదాయానికి ఆధునికతను జోడించిన ఆమె స్టైల్, సింపుల్ మేకప్, చీరకు తగ్గ ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కెమెరాలకు ఇచ్చిన స్టైలిష్ పోజులు, చిరునవ్వుతో అభిమానులను ఫిదా చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, నెటిజన్లు ఆమెను 'బ్లాక్ బ్యూటీ', 'ఎలిగెన్స్‌కు కొత్త నిర్వచనం' అంటూ ప్రశంసిస్తున్నారు.

